RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు మంచి రోజులు



4

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 326 | శనివారం | 01 - 06 - 2024 | పేజీలు : 4 | వెల : 5.00

# విస్ఫోటాల అంచున రుద్రారం గ్రామం




## ఏకమౌతున్న ప్రజా సంఘాలు

- అవినీతి ఇరిగేషన్ శాఖ పై యుద్ధం
- E E మధుసూదన్ రెడ్డి అవినీతి చిట్టా
- కలెక్టర్ కు రుద్రారం రైతుల మొర
- రుద్రారం గ్రామపంచాయతీ లో గ్రామసభ
- కలెక్టర్ ను పక్కదారి పట్టిస్తూ పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని కాలువ కబ్జాదారు లను కాపాడుతున్న ఇరిగేషన్ శాఖ అధికారులు
- NOC లేని అనుమతి పత్రాలు
- రుద్రారం సన్న కారు రైతుల ఉసురు



అడ్డువస్తే ఎదురుకోవడానికి బహుతిక దాడులకు సైతం ప్రైవేట్ సైన్యంతో



నీటిపారుదల శాఖ నుండి ఎటువంటి అనుమతులు NOC లేని అక్రమ నిర్మాణం

- భూగర్భ సొరంగాన్ని ఏర్పాటు చేసి, పైపులు వేయమని చెప్పిందే ఇరిగేషన్ శాఖ అధికారులు అంటున్న ప్రాజెక్ట్ ఇంచార్జ్ చంద్రశేఖర్



నీటిపారుదల శాఖ అధికారుల వ్యూహంతో భూగర్భ సొరంగం కోసం ప్రణాళిక సిద్ధం.

ప్రభాత సూర్యుడు, డెస్క్ : ప్రభాత సూర్యుడు వరస కథనాలతో పటాన్ చెరువు మండలం రుద్రారం గ్రామం జాతీయ రహదారి ఎన్ హెచ్ 65 ఆనుకొని రుద్రారం చిన్న చెరువు నుండి లకడారం పెద్ద చెరువుకు వరద నీరును మోసుకుపోతున్న గొలుసు కట్టు వాగుపై కాలువ ను కబ్జా చేస్తూ అక్రమంగా ఇరిగేషన్ శాఖ అనుమతులు లేకుండా భారీ అక్రమ నిర్మాణం జరుగుతున్నదని ప్రభాత సూర్యుడు వరస కథనాలు ప్రచురిస్తున్న విషయం పాఠకులకు విధితమే!!! దీనికి స్పందించిన ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఏక త్రాటి పైకి వచ్చి రుద్రారం గ్రామపంచాయతీలో గ్రామసభను ఏర్పాటు చేసుకొని జిల్లా ఇరిగేషన్ శాఖ అవినీతి అక్రమా లపై యుద్ధం చేయడానికి సిద్ధమ వుతున్నట్లు సమాచారం. జాతీయ రహదారి 65 పై గతంలోనే ప్రమాదకరమైన రిలయన్స్ గ్యాస్ పైప్ లైన్ ఎనిమిది ఫీట్ల లోతున ఏర్పాటు చేసి రుద్రారం గ్రామ ప్రజలకు ఒక బాంబును అమర్చిన విషయం ప్రజలు ఇప్పుడు గుర్తిస్తు న్నారు. అది సరిపోదని గొలుసు కట్టు కాలువను కొంతమంది కబ్జా చేస్తూ భారీ అక్రమ నిర్మాణం జరుగుతున్న విషయం విధితమే!!! వర్షాకాలంలో వరద నీరు గొలుసుకట్టు కాలువ లకడారం పెద్ద చెరువులో కలిపే కాలువ పై భారీ నిర్మాణం చేస్తూ అట్టి కాలువను మింగేసింద్రు, ఇక్కడే అసలు కథ మొదలవుతుంది ప్రవాహంలో వచ్చే వరద నీరు గొలుసు కట్టు కాలువ మూసుకుపోవడంతో ఆ నీరు ఎటు ప్రయాణం చేయాలి మల్ల తిరిగి వచ్చి జాతీయ రహదారిపై ఒక చెరువును తలపించే రీతిగా ఏర్పాటు కానుంది. ఆ వరద నీరు తిరిగి రుద్రారం సన్న కారు రైతులైన వారి పంట పొలాలపై ఎగ పాకి వారి పంట పొలాలకు నష్టం జరగనున్నది. ఇదొక ప్రమాదం పొంచి ఉన్నది. భూగర్భ సొరంగ పేరుతో భారీ

2

# మళ్లీ తెరపైకి నయిం కేసు

- నయీం కేసును రీ-ఇన్వెస్టిగేషన్ చేసేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- డైరీలోని అంశాల ద్వారా నిజాలను వెలికితీసే అవకాశం



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : నయీం కేసును రీ-ఇన్వెస్టిగేషన్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది. ఆయన డైరీలోని అంశాల ద్వారా నిజానిజాలను వెలికితీసే అవకాశం కనిపిస్తున్నది. ఎనిమిదేండ్ల క్రితం (2016లో) జరిగిన ఎన్‌కౌంటర్, దానికి కొనసాగింపుగా జరిగిన దర్యాప్తు వివరాలపై సర్కారు ఫోకస్ పెట్టనున్నట్లు సమాచారం. ఈ కేసు రీ ఇన్విస్టిగేషన్ ద్వారా స్వాధీనమైన సొమ్ము ఎంత? అప్పటి అధికార పార్టీ నేతలకు ఏమైనా చేరిందా? నయీంతో సంబంధాలున్న పోలీస్ ఆఫీసర్లు ఎవరు? పొలిటీషియన్లతో ఉన్న లింకులేంటి? ఇలాంటి అంశాలపై క్లారిటీ వచ్చే అవకాశముంది. దీంతో కొద్దిమంది పోలీసు అధికారులు, బీఆర్ఎస్ నేతల్లో గుబులు పట్టుకున్నది. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఇటీవల ఈ అంశాన్ని ప్రస్తావించారు. సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని అసెంబ్లీ వేదికగానే ప్రభుత్వానికి రిక్వెస్టు చేస్తానని చెప్పారు. దీంతో ఎనిమిదేండ్లుగా సైలెంట్‌గా ఉన్న ఈ

2

# కేసీఆర్ మళ్లీ సైలెంట్



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు :
నేటి రాజకీయాల్లో సోషల్ మీడియాకు ఉన్న ప్రాధాన్యత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ప్రతి పార్టీకి తప్పకుండా ఒక ఐటీ సెల్ మెయింటెయింన్ చేయక తప్పని పరిస్థితి. అలాగే, నాయకుల వ్యక్తిగత ఖాతాలు, పేజీలు నడుపుతుంటారు. అందుకోసం ప్రత్యేక సిబ్బంది కూడా పని చేస్తుంటారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చాలా చురుకుగా ఉంటారని అందరికీ తెలుసు. సోషల్ మీడియా వేదికగా

2



# లిక్కర్ ఒనర్స్ పంచాయితీ

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : తెలంగాణలో అత్యంత లాభదాయకమైన వ్యాపారం మద్యం వ్యాపారం. తెలంగాణలోనే కాదు దేశవ్యాప్తంగా ఎక్కువ ఆదాయం వచ్చే బిజినెస్ ఇదొక్కటే. మద్యం షాపులు, బార్ ఓనర్లే కాదు.. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారు కూడా భారీగా వెనకేస్తున్నారు. అందుకే బార్స్, వైన్స్ లైసెన్స్‌ల కోసం లక్షల రూపాయల వెచ్చించేందుకు కూడా వెనుకాడడం లేదు. ఇక మద్యం షాపులు, బార్ల ద్వారా ప్రభుత్వానికి నిత్యం కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. ఇలా

2

# ఏకమౌతున్న ప్రజా సంఘాలు

మొదటిపేజీ తరువాయి

పెద్ద ఎత్తున సిమెంటు పైపులను వేస్తూపోతే పక్కనే ఉన్న అతి ప్రమాదకరమైన రిలయన్స్ గ్యాప్ పైప్ లైన్ పేలి విస్ఫోటం జరిగే ప్రమాదం మన కళ్ళముందే ఉన్నది. ఇది గ్రహించిన గ్రామ పెద్దలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఏకతాటి పైకి వచ్చి రుద్రారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటు చేసుకొని భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికైనా స్థానిక రెవిన్యూ అధికారులు ఇరిగేషన్ శాఖ అధికారులు జిల్లా యంత్రాంగం ఇంత పెద్ద సమస్యపై దృష్టి పెట్టి కబ్జా దారులను శిక్షించి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డ ఇరిగేషన్ శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రుద్రారం సన్న కారు రైతులు ప్రభాత సూర్యుడు తో మొరపెట్టుకున్నారు. ఈ విషయమై వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రైతుల పక్షం ఉంటూ రైతులకు న్యాయం చేయాలని ప్రభాత సూర్యుడు సైతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.



భూగర్భ సొరంగం కై భారీ పైపులను రెడీగా ఉంచమని చెప్పిన ఇరిగేషన్ శాఖ అవినీతి తిమింగలాలు

# మళ్లీ తెరపైకి నయిం కేసు

మొదటిపేజీ తరువాయి

కేసులో రానున్న రోజుల్లో కదలిక తప్పదనే సంకేతం వెలువడినట్లయింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు బీఆర్ఎస్ నేతలకు నయీంతో లోపాయికారి సంబంధాలు ఉండేవని, వందల ఎకరాల భూములు వీరి అజమాయిషీలో ఉన్నాయని, బినామీల పేర్లతో వీరి స్వాధీనంలోకి వచ్చాయన్నది బహిరంగ రహస్యం. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత దర్యాప్తు కోసం అప్పటి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినా.. కొన్ని కారణాలు, ఒత్తిడి మేరకు ఆశించిన స్థాయిలో ఇన్వెస్టిగేషన్ జరగలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరి ఒత్తిడి ఉన్నది? దానికి కారణాలేంటి? అప్పటి అధికార పార్టీకి ఉండే ప్రయోజనాలేంటి? ఏయే లీడర్లకు ఎలాంటి సంబధాలున్నాయి? ఇవన్నీ ఆసక్తికర అంశాలు.నయీం నుంచి స్వాధీనం చేసుకున్న డైరీలోని అంశాలను ఇప్పుడు పరిశీలిస్తే లోతైన ఆధారాలు దొరుకుతాయన్నది పోలీసుల అభిప్రాయం. అప్పట్లో దర్యాప్తు చేసిన పోలీసు అధికారులు ఇప్పటివరకూ వివరాలను బహిర్గతం చేయలేదు. రాష్ట్రం మొత్తం మీద దాదాపు 200 కేసులు నయీంకు వ్యతిరేకంగా నమోదయ్యాయి. సుమారు 125 మందిని పోలీసులు అప్పట్లో అరెస్టు చేశారు. నయీంతో సంబంధాలున్నాయని, సెటిల్‌మెంట్ల పేరుతో భూములు ఆక్రమించారన్నది ప్రధాన ఆరోపణ. పోలీసులు సుమారు రూ. 100 కోట్ల మేర ఆస్తుల్ని సీజ్ చేసినట్లు అప్పట్లో చెప్పినా.. దానికి చాలా ఎక్కువ మొత్తంలోనే దొరికిందని, అది లెక్కల్లోకి రాకుండా పోయిందని, ఎవరి చేతుల్లోకి వెళ్లాయోననే అనుమానాలు దీర్ఘకాలంగా ఉన్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంతకాలం ఈ కేసు విషయాన్ని ప్రస్తావించడానికి ఎవరూ సాహసం చేయలేకపోయారు. నయీంకు సంబంధించిన కేసుల్లో 18 చార్జిషీట్లు కోర్టుల్లో దాఖలయ్యాయి. దాదాపు 800 మందికిపైగా సాక్షులను పోలీసులు విచారించారు. ఇందులో వంద మందికి పైగా కస్టడీలోకి తీసుకుని ప్రశ్నలవర్షం కురిపించి వివరాలను పోలీసులు రాబట్టారు. నయీంతో ప్రత్యక్షంగా సంబంధాలున్న 18 మందిని అప్పట్లోనే అరెస్టు చేసి పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేశారు. నయీం ఎన్‌కౌంటర్ తర్వాత కొన్ని వారాల పాటు పోలీసు దర్యాప్తులో హడావిడి కనిపించినా.. ఆ తర్వాత చడీ చప్పుడు లేకుండా సైలెంట్ కావడం అనేక అనుమానాలకు తావిచ్చింది. ఈ కేసు గురించి ఓపెన్‌గా మాట్లాడుకోడానికి కూడా చాలా మందికి ధైర్యం చాలలేదు. అటు పోలీసులు కూడా ఈ విషయాన్ని డిస్కస్ చేయడానికి నిరాకరించారు. అప్పటి ప్రభుత్వం ఈ కేసు వివరాలు తెలిసిన కొద్దిమంది పోలీసుల్ని లూప్‌లైన్‌లోకి నెట్టేసిందినయీంకు పోలీసు ఆఫీసర్లతో పాటు అప్పటి ప్రభుత్వం నుంచి ఉన్న అండదండలతో ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని భువనగిరి జిల్లాల్లో తనదైన సామ్రాజ్యాన్ని నెలకొల్పుకున్నారు. దందాలు చేయడం, సెటిల్‌మెంట్ల పేరుతో భూముల ఆక్రమణ, పేదలను బెదిరించడం... ఇలాంటి అనేక అరాచకాలకు పాల్పడ్డాడు. ఎన్‌కౌంటర్ తర్వాత పోలీసులు స్వాధీనం చేసుకున్న డైరీలోని అంశాలు బయటకు పొక్కలేదు. నయీం నుంచి స్వాధీనం చేసుకున్న వందల కోట్ల రూపాయల ఆస్తులు, భూముల పత్రాలు ఏమైపోయాయో మిస్టరీగానే ఉండిపోయింది. నయీంకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఎన్‌కౌంటర్ తర్వాత ఆయనతో సంబంధాలున్న అనేక మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు.ఇప్పుడు హఠాత్తుగా అచ్చంపేట ఎమ్మెల్యే నయీం కేసు రీ-ఇన్వెస్టిగేషన్ డిమాండ్‌ను తెరపైకి తేవడంతో ప్రభుత్వం ఈ దిశగా రానున్న రోజుల్లో అడుగులు వేయనున్నదనే సంకేతం వెలువడినట్లయింది. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు నయీంతో సంబంధాలున్నాయని, ఈ వ్యవహారం బహిర్గతం కావాలంటే ఆ కేసును ప్రభుత్వం మరోసారి దర్యాప్తు చేయడం అవసరమని డాక్టర్ వంశీకృష్ణ ఇటీవల మీడియాతో వ్యాఖ్యానించారు. నయీం కేసును తిరిగి దర్యాప్తు చేయడం ద్వారా బీఆర్ఎస్ నేతలకు ఎలాంటి సంబంధాలున్నాయన్నది తేటతెల్లమవుతుందని, అందువల్లనే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతానని నొక్కిచెప్పారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తానని, పోలీసు దర్యాప్తుకు ఆదేశించి పూర్తి వివరాలను వెలికి తీయాలని కోరుతానని డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు.

# లిక్కర్ ఓనర్స్ పంచాయితీ

మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగే వ్యాపారాన్ని ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది. భారీగా లాభాలు వచ్చే మద్యం షాపులు, బార్లలో నేతలు, కార్పొరేట్ సంస్థల యజమానులు భారీగా పెట్టుబడి పెడుతున్నారు. కొందరు డైరెక్టుగా పెట్టుబడి పెడితే.. కొందరు ఇండై రెక్టుగా వీటిలో వాటా కలిగి ఉంటారు. అందుకే రెండేళ్ల కోసారి నిర్వహించే మద్యం షాపుల టెండర్లకు పోటీ పెరుగుతూనే ఉంది. టెండర్ ఫీజుల లక్షల రూపాయలు ఉంది. తిరిగి చెల్లించరు.. అయినా టెండర్లు వేస్తూనే ఉన్నారు. ఇక ఇప్పుడు తెలంగాణలో బార్ ఓనర్లు, వైన్స్ ఓనర్ల మధ్య కొత్త పంచాయతీ మొదలైంది. బార్‌షాపుల ఓనర్లంతా ఒక్కటై వైన్ షాపుల యజమానులపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వైన్ షాపు పక్కన పర్మిట్ రూమ్స్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నిబంధనల ప్రకారం ఇది 100 చ.మీ మించి ఉండకూడదు. కానీ మద్యం షాపుల యజమానులు వీటిని పట్టించుకోవడం లేదు. 2 వేల చ.మీ వరకు కూడా పర్మిట్ రూమ్స్ నిర్వహిస్తున్నారు. దీంతో బార్లకు వచ్చే కస్టమర్లు తగ్గిపోతున్నారు. ఇక వైన్ షాపులలో ఎలాంటి తినుబండారాలు తయారు చేయరాదు. కానీ వైన్స్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసే పర్మిట్ రూంలు మినీ బార్లుగా కనిపిస్తున్నాయి. ఒక్క ఏసీ మినహా ఇక్కడ అన్ని వసతులు ఉంటున్నాయి. అన్నిర కాల ఆహార పదార్థాలు దొరకుతుంటాయి. ఇదిలా ఉంటే.. వైన్స్‌కు ప్రభుత్వం చాలాకాలంగా పర్మిట్ రూంలకు అనుమతి ఇస్తుంది. ఇందుకు అదనంగా రూ. 2 లక్షల రుసుం వసూలు చేస్తుంది. అయితే, ఇన్నాళ్లూ పెద్దగా పట్టించుకోని బార్ల యజమానులు ఇప్పుడు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది చివర్లో మద్యం షాపులకు టెండర్లు పిలిచింది. అనుమతులు ఇచ్చింది. ఈ ఏడాది నుంచి కొత్త షాపులు అమలులోకి వచ్చాయి.



మొదటిపేజీ తరువాయి

కొత్తగా షాపులు ఏర్పాటు చేసుకున్న యజమానులు పర్మిట్ రూం నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించారు. ఇష్టానుసారంగా వందల చదరపు మీటర్ల విస్తీర్ణంలో పర్మిట్ రూంలు ఏర్పాటు చేశారు. దీంతో బార్లకు నాలుగైదు నెలలుగా గిరాకీ తగ్గింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బార్ల యజమానులు ఒక్కటై ఫ్యిదు చేశారు. మరి దీనిపై ఎక్సైజ్ శాఖ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# కేసీఆర్ మళ్లీ సైలెంట్



మొదటిపేజీ తరువాయి

ఆయన చాలా విషయాలు పంచుకుంటూ ఉంటారు. ప్రజలను, ముఖ్యంగా యువతను చేరువ కావడానికి ఇది మంచి మార్గం. మాజీ సీఎం కేసీఆర్ కూడా ఈ దారిని పార్లమెంటు ఎన్నికల ముందు ఎంచుకున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కేసీఆర్ ప్రజల మధ్యకు వెళ్లడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. బస్సు యాత్రలు, సోషల్ మీడియా ఖాతా, టీవీ ఛానల్ ఇంటర్వ్యూ ఇలా చాలా మార్గాల్లో ప్రయత్నించారు. తమ నాయకుడు ప్రజల్లోకి రావడం మంచిదని ఆయన అభిమానులు శుబపరిణామంగా అనుకున్నారు. కానీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే షరా మామూలే. కేసీఆర్ ఎక్కడా కనిపించడం లేదు. ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉపఎన్నిక ప్రచారంలో కూడా కేటీఆరే ఎక్కువగా కనిపిస్తున్నారు. దీంతో కేసీఆర్ మళ్లీ తన దిశ మార్చుకున్నారా? అనే చర్చ జరుగుతున్నది.సోషల్ మీడియాలోనూ కేసీఆర్ ప్రెజెన్స్ మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలింది. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎక్స్‌లో ఆయన అరంగేట్రం చేశారు. వచ్చిన రెండు రోజులకు తన ట్వీట్లతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపారు. కరెంట్ కోతల గురించి ఘాటైన ట్వీట్లు చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించిన సర్క్యూలర్ వివాదాన్ని రేపారు. ఈ వివాదం చినికి చినికి మన్నె క్రిశాంక్ అరెస్టు వరకు వెళ్లింది. ఆ తర్వాత మే 1న కార్మికులకు మేడే శుభాకాంక్షలు చెప్పి తన ఎక్స్ ప్రయాణానికి తాత్కాలిక విరామాన్ని ప్రకటించారు. కేసీఆర్ ఎక్స్ ఖాతా మొదలు పెట్టి నెల పూర్తి కావొస్తోంది. ఇన్ని రోజుల్లో ఏడు పోస్టులు పెట్టిన కేసీఆర్ మే 1వ తేదీ నుంచి మరే పోస్టూ పెట్టలేదు. ఓ టీవీ చానెల్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూకు సంబంధించిన ఫొటోనే ఎక్స్‌లో ప్రొఫైల్ ఫొటోగా పెట్టుకున్నారు.ఇక కేసీఆర్‌కు ఉన్న ఛరిష్మాకు తగిన విధంగా ఎక్స్ ఖాతాలో ఫాలోయింగ్ రాలేదు. నెల రోజులు అవుతున్నా ఇంకా 33 వేల మంది ఫాలోవర్లు మాత్రమే వచ్చారు. అదే కేటీఆర్‌కు ఈ సంఖ్య 43 లక్షలు. కేసీఆర్ ఎక్స్ అకౌంట్ యాక్టివ్‌గా లేకపోవడం కూడా ఈ ఫాలోవర్ల సంఖ్య తక్కువగా ఉండటానికి ఒక కారణమై ఉండొచ్చు. కానీ, అభిమానులు చాలా వరకు ఆయన మాటలను వినాలనే కోరుకుంటారు. చూడాలి, కేసీఆర్ తీరు మారుతుందో లేదో.

# ముందుగా అరగంట

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : లంగాణలో ప్రభుత్వ పాఠశాల జూన్ 12న పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత బడుల పనివేళలను విద్యాశాఖ సవరించింది. ఇకపై ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉదయం 9 గంటలకే ప్రారంభం కానున్నాయి. మరోవైపు, ఉన్నత పాఠశాలలు మాత్రం ఉదయం 9.30 గంటల నుంచే పనిచేస్తాయి. అయితే, వాటి పనివేళలను కూడా ఉదయం 9 గంటలకే మార్చాలని అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. అలాగే, వచ్చే విద్యా సంవత్సరానికి అకడమిక్ క్యాలెండర్‌ను కూడా విద్యాశాఖ విడుదల చేసింది.గతంలో ప్రభుత్వ పాఠశాలలన్నీ ఉదయం 9 గంటలకే ప్రారంభయమయ్యేవి. కానీ, 2023 ? 24 విద్యా సంవత్సరం నుంచి వీటి సమయాన్ని 9.30 గంటలుగా మార్చారు. అయితే, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉదయం 8 గంటలకే స్కూలు బస్సులెక్కి పోతుంటే, సర్కారు బడి పిల్లలు మాత్రం ఉదయం 9.30 గంటలకు వెళ్లడం వల్ల సర్కారు బడులపై తల్లిదండ్రులకు చులకన భావం ఏర్పడుతుందని విద్యాశాఖ అధికారులు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వివరించారు. దీంతో బడి వేళల్లో మార్పులు చేశారు. మరోవైపు.. హైస్కూళ్లను 9.30 గంటలకు తెరిస్తే సాయంత్రం 4.45 గంటల వరకు విద్యార్థులు బడిలోనే ఉండాల్సి ఉంటుందని, దీనివల్ల చలి, వర్షాకాలాల్లో వారు ఇళ్లకు వెళ్లేసరికి ఆలస్యమై, బాలికలకు రక్షణ కరువవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో వీరి బడి సమయాన్ని కూడా మార్చితే ఎలా ఉంటుందనే కోణంలో విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు.ఆరు, ఏడు తరగతుల గణితం సబ్జెక్టును ఇక నుంచి భౌతికశాస్త్రం ఉపాధ్యాయులే బోధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రెండు తరగతులకు గణితం టీచర్లు బోధిస్తే వారిపై పనిభారం పెరుగుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# నిలువునా ముంచుతున్న నకిలీ విత్తనాలు



కర్నూలు, ప్రభాత సూర్యుడు : కిలీ విత్తనాలు రైతులను నిలువునా ముంచుతున్నాయి. తక్కువ ధరకు వస్తు?న్నాయనే ఆశతో కొనుగోలు చేసి నష్టాలపాలౌతున్నారు. వేసవి దుక్కులు ప్రారంభం నుంచే నకిలీ మాఫియా తమ కార్యకలాపాలను విస్తరింపజేసేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఏడాదికేడాది అసలు విత్తన కంపెనీలను పోలినట్లుగా తయారు చేస్తూ.. ప్యాకింగ్ లో ఎలాంటి తేడా లేకుండా జాగ్రత్త పడుతూ వాటిని రైతులకు అంటగడుతున్నారు. ఫలితంగా రైతులు నిలువునా మునుగుతున్నారు. నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకుని మరీ దందా సాగిస్తున్నారు. కొందరు బస్సులు, ఇతర వాహనాల్లో తరలిస్తున్న వారిని విజిలెన్స్, వ్యవసాయ, పోలీసు శాఖలు సమన్వయంతో పట్టుకుంటున్నారు. అయితే వీటిని పూర్తిస్థాయిలో నకిలీ విత్తనాలకు బ్రేకులు వేయడం లేదనే విమర్శలున్నాయి. వేయలేకపోతున్నారనే విమర్శలున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 నియోజక వర్గాలు, 57 మండలాలు, 921 రెవెన్యూ గ్రామాలు, 993 పంచాయతీలున్నాయి. 40.52 లక్షల జనాభా, 9.06 లక్షల హెక్టార్ల సాగు భూమి ఉంది. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్ కు ముందుగానే నకిలీ విత్తనాలు మాఫియా పుణ్యమానీ పురుడు పోసుకుని రైతులను నట్టేటా ముంచేందుకు సిద్ధం చేస్తోంది. మే మాసం చివరి వారం నుంచే ఈ తంతు ప్రారంభించి జూన్ మాసంలో రైతులకు అంటగడుతోంది. రైతులు తొలకరి చినుకులు పడగానే విత్తనాలు వేసి దిగుబడి కోసం ఎదురు చూసే సమయానికి నష్టపోయామని తెలిసి బోరున విలపించడం అనవాయితీగా మారింది. ఉమ్మడి జిల్లాలో 20 నుంచి 40 జిన్నింగ్ మిల్లులు ఉండడం, ప్రముఖ వ్యాపారులు సీడ్ఆర్గనైజర్ల పేరిట మాఫియాగా ఏర్పడి నాసిరకం విత్తన సరఫరా చేస్తున్నారు. ఏపీ, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో సామ్రాజ్యాన్ని విస్తరించి దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే గతేడాది నకిలీ పత్తి విత్తన వినియోగంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్షలాదిఎకరాల్లో పంటను కోల్పోయారు. సీడ్ ఆర్గనైజర్లు,దళారులు, దుకాణ దారులతో కూడిన మాఫియా పటిష్ట నెట్వర్క్ ను ఏర్పరచుకుని తమ కార్యకలాపాలను సజావుగా సాగిస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా వాటిని విక్రయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. విత్తనోత్పత్తి క్రమంలో నాణ్యతపై లేబొరేటరీల్లో పరీక్షించాలి. వ్యవసాయాధికారి మూడుసార్లు తనిఖీ చేయాలి. ఈ పంటలను ప్రత్యేకంగా కోసి ప్రాసెసింగు తీసుకురావాలి. వీటిని డీఎన్ఏ పరీక్షలో గానీ, గ్రోఔట్ ద్వారా పరీక్షించి నాణ్యతను, జెనెటిక్ ప్యూరిటీని నిర్ధారిస్తారు. ఈ ప్రక్రియలో ఎక్కడ లోపం జరిగినా 98-99 శాతం నాణ్యత లేకపోయినా అది నాసిరకం కిందరకు వస్తుంది. విత్తనాల్లో మొలక శాతం 65 నుంచి 90 వరకు ఉండాలి. పత్తిలో మొలకశాతం 75 ఉండాలి. అంతకంటే తక్కువుంటే నాసిరకం గానీ, నకిలీ కింద లెక్కగడుతారు. అలాగే పత్తిలో బీటీ ప్రొటీన్ 90 శాతం ఉండాలి. ఈ మేరకు నాణ్యత ఉన్న వాటినే కంపెనీలు రైతులకు విక్రయించాలి. అంతేకాకుండా విత్తనాల ప్యాకెట్ల లేబుల్ పై ఆ విత్తనం నిర్దేశిత ప్రాంతానికిసరిపోతుందో లేదో విశదీకరించాలి. నాణ్యత శాతం, మొలక, తేమ శాతం, పత్తికి బీటీ ప్రొటీన్ శాతం వంటివి ఉండేలా చూడాలి. లాట్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలి. పత్తికి జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ ధ్రువీకరణ ఉండాలి. ఇవి ఉంటేనే నాణ్యమైన విత్తనంగా గుర్తిస్తారు. జనరల్ సీడ్ సర్టిఫికేషన్ స్టాండర్డ్స్ ప్రకారం ప్రయివేట్ వెరైటీలకు ఆయా కంపెనీల స్వీయ ధ్రువీకరణ చేసుకుంటే చాలు లైసెన్స్ వచ్చినట్టే. ఆ విధంగా విత్తన చట్టం వెసులుబాటు కల్పిస్తోంది. అయితే స్వీయ ధ్రువీకరణ, విత్తనోత్పత్తి మీద నియంత్రణ విత్తన చట్టంలో లేకపోవడాన్ని ఆసరాగా తీసుకుని కొన్ని కంపెనీలు నకిలీ వరిలో విత్తన దందాకు తెరతీస్తూ రైతుల్ని నట్టేట ముంచుతున్నాయి. అక్రమార్కులు, వ్యాపారులు కుమ్మక్కై నిర్దేశిత ప్రమాణాల ప్రకారం లేని విత్తనాలను, గడువు ముగిసిన విత్తనాలను, స్థానికంగా తయారు చేసిన విత్తనాలను పెద్ద ఎత్తున రైతులకు అంటగడుతూ విత్తన మాఫియా జేబులు నింపుకుంటోంది. ప్రభుత్వ విత్తనాలు చాలినన్ని లభించకపోవడం, నకిలీ విత్తనాలు తక్కువ ధరకు లభిస్తుండంతో రైతులు వీటిని కొని మోసపోతున్నారు. వీటి విక్రయాల్లో వాళ్లు పేరుగాంచిన కంపెనీల అసలును పోలిన అందమైన లేబుళ్లను ముద్రించి ఆకర్షణీయమైన ప్యాకింగ్ లతో రైతులను బురిడీ కొట్టిస్తున్నారు. సాధారణంగా ఏ విత్తనాల ఖరీదు ఎక్కువగా ఉంటుందో ఆ విత్తనాలకు సంబంధించే నకిలీ విత్తనాలు పుట్టు కొస్తుంటాయి. కొంతమంది ఆర్గనైజర్లు, దళారులు కుమ్మకై ఉత్పత్తి చేస్తున్న నకిలీలో సింహభాగం పత్తి విత్తనం కావడం గమనార్హం. ఉదాహరణకు ఒక ఎకరాలో పత్తి సాగుకు ఏకంగా రూ.1,500 విలువైన విత్తనాలను విత్తాల్సి ఉంటోంది. ఈ కారణంగానే ఈ పంటకు సంబంధించి తక్కువ ధరతో నకిలీ విత్తనాలు పుట్టుకొస్తున్నాయి. రైతులు కూడాఎప్పటికప్పుడు ధర తక్కువగా ఉంది కదా అని వాటినే కొనుగోలు చేస్తూ దిగుబడి రాక మోసపో తున్నారు. ఈ సారి పత్తి సాగు మరింత పెరుగుతు oదనే అంచనాల నేపథ్యంలో నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్ ను ముంచెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే నకిలీ విత్తనాలు ఉత్పత్తి ముఠాలు, కొంత మంది వ్యాపారులు సన్నాహాలు చేసుకునే క్రమంలో పోలీసులకు అడ్డంగా పట్టు పడుతుండడం విశేషం. కర్నూలు జిల్లాలో పత్తిని ఎక్కువగా పశ్చిమ ప్రాంతం లో సాగు చేస్తారు. గతేడాది దాదాపు 3 లక్షల హెక్టార్లలో పత్తి సాగు కాగా, ఈ ఏడాది అదే స్థాయిలో పత్తి సాగు అయ్యే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాకు 15 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరంగా గుర్తించగా ఇప్పటివరకు 8 లక్షలకు పైగా విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. సాధారణంగా పత్తి మొక్కజొన్న, మిర్చి నూటికి నూరు శాతం ప్రయివేట్ కంపెనీలే సమకూర్చు తున్నాయి. ఇక కంది, వరిలో 50 శాతం కూడా ప్రయివేట్ విత్తనమే. ఇవన్నీ కూడాచట్టం పరిధిలోకి రావు. ఇదే సమయంలో విత్తు కొరత, అధిక ధరలు నకిలీ విత్తన విక్రయాలకు తెర లేపుతున్నాయి. చిన్నాపెద్దా కంపెనీలు నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్నాయి. ఈ క్రమంలోనే వీటికి సంబంధించి జిల్లాలో 150 మంది వరకు ఉన్నట్లు నిఘా వర్గాల సమాచారం. రైతులకు, కంపెనీలకు మధ్య బ్రోకర్లుగా వ్యవహరిస్తూ కొందరు ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకులు కల్తీ విత్తనాలను అంటగడుతున్నారు. ఇవేమీ తెలియని రైతులు నకిలీ విత్తనాలు వినియోగించి పంట ఉత్పత్తులు రాగా నిండా మునిగిపోతున్నారు. చేసిన అప్పులు తీర్చలేక బలవణ్మరణాలకు పాల్పడుతున్నారు. గతంలో జిల్లాలో దాదాపు 10 కంపెనీలపై అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకున్నారు. 10 కంపెనీలపై చేసిన దాడుల్లో రీసైక్లింగ్ వ్యవహారం బయటపడింది. ఒక విత్తన డీలర్ ఒక సాధారణ పత్తి విత్తన ప్యాకెట్ అమ్మితే రూ.25 నుంచి రూ.30 ల వరకు లాభం వస్తుంది. అదే బీటీ -3 విత్తన ప్యాకెటు విక్రయిస్తే రూ.500, లూజ్ విక్రయిస్తే కిలోకు రూ. వెయ్యి చొప్పున మిగులుతాయి. ఈ క్రమంలోనే నకిలీ విత్తన వ్యవహారానికి తెర తీస్తూ అనేక ముఠాలు పోలీసులకు అడ్డంగా దొరికిపోతున్నారు.

## రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డా అవినీతి అధికారులు



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : నలుగురు ఇరిగేషన్ శాఖ అధికారులు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా ఈఈ బన్సీలాల్‌తో పాటు ఇద్దరు ఏఈలు, సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం నలుగురిని నాంపల్లి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్‌కు చెందిన బొమ్ము ఉపేంద్ర నాథ్ రెడ్డి తన ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అనుమతి ఇవ్వడం కోసం ఇరిగేషన్ అధికారులు రెండున్నర లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఉపేంద్రనాథ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పథకం రూపొందించుకున్నారు ఏసీబీ అధికారులు. ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో ఇఇతోపాటు ఇద్దరు ఏఈ లను లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. ఇంటి నిర్మాణం చేపట్టాలంటే రెండున్నర లక్ష రూపాయలకుగానూ అడ్వాన్స్‌గా లక్షయాభై వేల రూపాయలను తీసుకున్నారు. సర్వే చేయడం కోసం సర్వేయర్ గణేష్ కూడా రూ.40 వేలు డిమాండ్ చేశారని ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితులలో ఏ1 వద్ద నుండి రూ.65 వేలు, ఏ3 వద్దనుండి రూ.35 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు ఎసిబి అధికారులు తెలిపారు.

## 12 ఏళ్లు దాటితే... నో ఎంట్రీ

తిరుమల, ప్రభాత సూర్యుడు : 12 ఏళ్లు దాటిన వాహనాలను తిరుమల ఘాట్ రోడ్డుపైకి అనుమతించకూడదని టీటీడీ నిర్ణయించింది. తిరుమల ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు గాను టీటీడీ నిర్ణయం తీసుకుంది. తిరుమల ఘాట్‌రోడ్లపై గతంలో ఎప్పుడూ లేనట్లుగా వరుసగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గత వారం రోజుల్లో జరిగిన వరుస యాక్సిడెంట్లతో అటు భక్తులు.. ఇటు టీటీడీ అధికారులు ఉలిక్కిపడ్డారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోయినా.. రెండు ఘాట్ రోడ్లలో కలిపి ఐదారు ప్రమాదాలు జరిగాయి. పదుల సంఖ్యలో భక్తులు గాయపడ్డారు. అప్పుడప్పుడు తిరుమల ఘాట్ రోడ్లలో చిన్నపాటి ప్రమాదాలు జరగడం కామన్. కానీ పదుల సంఖ్యలో భక్తులతో వెళ్తున్న బస్సు, టెంపో లాంటి వాహనాలు పల్టీలు కొట్టడం మరింత టెన్షన్ కలిగిస్తోంది. అయితే ప్రమాదాలకు వాహనదారులు కారణమా.. ఘాట్ రోడ్లలోనే మార్పులు చేయాల్సి ఉందా అన్న చర్చ జరుగుతోంది. తిరుమల ఘాట్‌లో ప్రమాదాలకు స్పీడ్ లిమిట్ నిబంధనలను ఎత్తివేయడం కూడా ఒక కారణమని తెలుస్తోంది. గతంలో అలిపిరి నుంచి తిరుమలకు ప్రయాణ సమయం 28 నిమిషాలుగా ఉండేది. తిరుమల నుంచి అలిపిరికి వచ్చే సమయం 40 నిమిషాలు ఉండా లన్న నిబంధనలు అమలు చేశారు. అంతకంటే వేగంగా వాహనాలు రాకపోకలు సాగిస్తే చర్యలు తీసుకునేవారు. ఓవర్ స్పీడ్, నిబంధనలు ఉల్లంఘించారని ఫైన్లు వేసేవారు. కొద్ది నెలల క్రితం ఈ స్పీడ్ లిమిట్ నిబంధనలను సడలించారు. అప్పటి నుంచి డ్రైవర్లు వాహనాలను ఓవర్ స్పీడ్ తో నడుపుతున్నట్లు గుర్తించారు పోలీసులు. కొందరు డ్రైవర్లు ఓవర్‌టేక్ లు చేస్తూ.. అడ్డగోలుగా హారన్స్ ఊనీతీనీనిబ కొడుతూ ఇతర వాహనాలను ఇబ్బంది పెడుతున్నట్టు తేల్చారు. ఈ సమయంలో అయోమయానికి గురై స్పీడ్ ను కంట్రోల్ చేయలేక వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నట్లు చెబుతున్నారు టీటీడీ అధికారులు. తిరుమలకు ప్రతిరోజు వేలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. కార్లు, ప్రైవేటు బస్సులు, టెంపోలు, జీపులు ఇలా పదివేల వరకు వాహనాలు వస్తుంటాయి.. వెళు ్తంటాయి. ప్రతిరోజు 9 నుంచి 10 వేల కార్లు రెండవ ఘాట్ రోడ్ల మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. మరో 3వందల వరకు ఆర్టీసీ బస్సులు తిరుమల.. తిరుపతి మధ్య ప్రతిరోజు భక్తులను తరలిస్తాయి. ఇక టూవీలర్ల రాకపోకలు అయితే వేల సంఖ్యలోనే ఉంటాయి. కరోనా తరువాత తిరుమలకు వచ్చే భక్తుల రద్దీ పెరగడంతో పాటు వాహనాల సంఖ్య కూడా అంతే స్థాయిలో పెరిగింది. ప్రతిరోజు తిరుమలలో 20 వేల వాహనాలు ఉంటాయంటే ఆశ్చర్య పోనవసరం లేదు. రోజురోజుకు తిరుమలకు వస్తున్న భక్తుల రద్దీ పెరుగుతూ వస్తోంది. భక్తులతో పాటు ప్రమాదాలూ పెరుగుతున్నాయి. మొదటి ఘాట్ రోడ్ లో మే 28న ఎలక్ట్రిక్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొందరు భక్తులకు గాయాల య్యాయి. అదృష్టవశాత్తు బస్సు పల్టీలు కొట్టకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అదే విధంగా మొదటి ఘాట్ రోడ్డులో 6వ మలుపు దగ్గర కర్ణాటకకు చెందిన టెంపో ట్రావెలర్ వాహనం అది తప్పి బోల్తా పడింది. ఈ



ప్రమాదంలో 13 మంది భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అదేవిధంగా తిరుమలకు వెళ్లే రెండో ఘాట్ రోడ్లో కూడా ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి రెండు కార్లు ప్రమాదానికి గురయ్యాయి. మొదటి ఘాట్ రోడ్ లో మరో వాహనం ప్రమాదానికి గురైంది..మరో వైపు 12 ఏళ్లకు పైబడిన వాహనాలను తిరుమల ఘాట్ రోడ్డులో వాహనాలకు అనుమతి ఇవ్వకూ డదని టీటీడీ నిర్ణయం తీసుకుంది. సెల్ ఫోన్ డ్రైవింగ్ , వేగంగా వాహనాలు నడపడం, నిద్రలేమి , ఫిట్ నెస్ లేని వాహనాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికా రులు గుర్తించారు. ఘాట్ రోడ్డులో ఫిట్ నెస్ లేని వాహనాలు ప్రమాదాలకు కారణంగా మారు తన్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో 12 ఏళ్లు దాటిన వాహనాలను తిరుమల ఘాట్ రోడ్డుపైకి అనుమతి ఇవ్వకూ డదని టీటీడీ నిర్ణయం తీసుకుంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## ఎడిటోరియల్ EDITORIAL

# ఉచిత హామీలు...అవినీతేనా

ప్రభాత సూర్యుడు, డెస్క్ : ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ప్రకటించే మేనిఫెస్టోపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో చేసే వాగ్దానాలు అవినీతి కిందకు రావని సుప్రీంకోర్టుపేర్కొంది. ఎన్నికల చట్టాలప్రకారం మేనిఫెస్టోలోని పథకాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు ఆర్థిక సహాయం చేసినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. ఎన్నికల వేళ మేనిఫెస్టో ప్రకటించడం అవినీతి చేయడంతో సమానమని పిటిషనర్ చేసిన వాదనను తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ వీకే విశ్వనాథన్ లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్ వాదన విచిత్రంగా ఉందని అభిప్రాయపడింది. తగిన సమయంలో దీనిపై నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది. కర్ణాటకలో గతేదాది అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. చామరాజనగర్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీజెడ్ జమీర్ అహ్మద్‌ఖాన్ గెలుపొందారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో అనేక హామీలు ప్రకటించింది. దీనిపై శశాకం జె శ్రీధర అనే వ్యక్తి స్థానిక హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీలు అవినీతి కిందకే వస్తాయని పిటిషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన జమీర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ శశాంక శ్రీధర్ హైకోర్టును ఆశ్రయించారు.రాజకీయ పార్టీలు అధికారం చేపట్టేందుకు అలవిగాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని పిటిషన్‌లో ఆరోపించారు. వీటి కారణంగా ప్రజలు ప్రలోభాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇష్టారీతిన మేనిఫెస్టోలు, హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత వాటిని విస్మరిస్తున్నారని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ కారణంగా రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు కూడా అవినీతికి కిందకే వస్తాయని, వీటిపై తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.జరిపిన కర్ణాటక హైకోర్టు పిటిషనర్ వాదనలను తోసిపుచ్చింది. తాము అమలు చేయాలనుకుంటున్న విధానాల గురించి ఏదైనా పార్టీ ప్రకటించడాన్ని అవినీతిగా పరిగణించలేమని పేర్కొంది. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123 కింద మేనిఫెస్టోను అవినీతిగా పరిగణించలేమని తెలిపింది. వాటిని సంక్షేమ విధానాలుగానే చూడాలని, ఆర్థికపరంగా అవి సరైనవేనా కాదా అనేది వేరే విషయమని అభిప్రాయపడుతూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో శశాంక దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కర్ణాటక హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం పార్టీల మేనిఫెస్టోల్లోని హామీలను ప్రజలు నమ్మితే ఎవరేం చేస్తారని ప్రశ్నించింది. మేనిఫెస్టోను అవినీతిగా పరిగణించలేమని పిల్‌ను తోసిపుచ్చింది.ఎన్నికల సమయంలో పార్టీ ప్రణాళికలను విడుదల చేయడం చట్టబద్ధమైనప్పటికీ వాటి అమలుకు నైతిక బాధ్యత వహించవలసిన అవసరం పార్టీలకు ఉండడం లేదు. అలవికాని హామీలు ఇవ్వడం, ఓటర్లను ప్రలోభ పెట్టడం, గెలిచాక నిలబెట్టుకోలేక పోవడం రివాజుగా మారింది. తమిళనాడులో ఉచిత చీరలు, ప్రెషర్ కుక్కర్లు, వాషింగ్ మిషన్లు, టెలివిజన్లతో ప్రారంభమైన 'రేబిడీ సంస్కృతి' నేడు దేశం అంతా విస్తరించింది. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు ఉచిత వాగ్దానాలకు బాగా అలవాటు పడ్డాయి. ఉచిత కరెంటు, గ్యాస్ సిలిండర్లు, టికెట్ లేని బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి, రుణమాఫీ, స్కూటీలు, లాప్టాప్ లు, తాళిబొట్లు, పెళ్లికి సహాయం, తదితర పేర్లతో ఓటర్లను ప్రలోభపెడుతున్న పార్టీలు ఆర్థికవ్యవస్థను అనారోగ్యానికి గురిచేస్తున్నాయి. రాజకీయ పార్టీలు నేడు ఉచితాలకు సంక్షేమ పథకాలకు మధ్య విభజన రేఖను చెరిపివేస్తున్నాయి. ఆర్థికంగా వెనుకబడిన పేద, మధ్యతరగతి ప్రజలకు రోజువారి కనీస సదుపాయాలు రాయితీ ధరతో సులభంగా పొందేందుకు ఇచ్చే సంక్షేమ పథకాలను, ఎలాంటి హేతుబద్ధత లేకుండా విలాసాలను కూడా అవసరాలుగా భ్రమింపజేస్తూ ఉచితంగా ఇస్తూ అవి సంక్షేమ పథకాలుగా పార్టీలు చెబుతున్నాయి. అధికారమే పరమావధిగా సరికొత్త ఉచిత హామీలు ఇవ్వడంలో పార్టీలు తమలో తామే పోటీపడుతున్నాయి. ఉచితాలు నిష్పక్షపాత ఎన్నికలు అనే భావనకు విఘాతంగా మారుతున్నాయి. ప్రజల డబ్బుని ఎగురవేసి ఓట్లు సంపాదించే మార్గాలుగా పార్టీలు ఉచితాలను తీర్చిదిద్దుతున్నాయి. ఉచిత విద్యుత్తు, ఉచిత రవాణా లాంటి దారి తెన్నులేని, ప్రణాళిక లేని పథకాలు ఆయా సంస్థలను నిర్వీర్యం చేసి మొత్తంగా మూసివేతకు దారి తీయవచ్చు. ఇప్పటికే అనేక రాష్ట్రాలు రుణ భారం పెరిగి ప్రాధాన్య రంగాలపై తగిన నిధులను వెచ్చించలేకపోతున్నాయి. బడ్జెట్ పై ఒత్తిడి పెరగటం, విద్య, ఆరోగ్య రంగాలకు నిధుల కొరత, దేశ స్థూల ఉత్పత్తి సామర్థ్యం, ఆర్థిక సమతుల్యం దెబ్బ తినటం, వాంఛనీయం కాని వస్తు సేవల వినియోగం పెరగటం, వంటి నష్టాలు కలుగుతాయి. సంక్షేమం పేరుతో బడ్జెట్ లో సింహం భాగం ఖర్చు చేయడం వల్ల సామాజిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల వృద్ధి, ఆధునికీకరణ జరగకపోవడం, సమాజం వెనుకబాటుకు గురికావడం జరుగుతుంది. ఉచితాలపై కమిటీ వేయాలి మేనిఫెస్టోలోని హామీలతో వనరుల వివరాల సమర్పణ తప్పనిసరి చేయడమే గాక, అమలు చేయని పార్టీల గుర్తింపును రద్దు చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఇవ్వాలి. ఉచితానుచితాలను నిర్ణయించేలా, ఉచితాలకు సంక్షేమ పథకాలకు మధ్య విభజన రేఖను గుర్తించేందుకు నిపుణుల కమిటీని నియమించాలి. రుణ భారం పెంచే ఆర్థికవృద్ధిని నష్టపరిచే ఉచితాలను రద్దు చేయాలి. ఈసీ అధికారాలపై గల పరిమితులను తొలగించాలి.

# సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు మంచి రోజులు



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : రాష్ట్రంలోని రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ ఆఫీసులకు ధీటుగా తీర్చిదిద్దాలని ప్రభు త్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చాలావరకు అద్దె ఆఫీసుల్లోనే కొనసాగుతున్నాయి. చా లా ఏళ్లుగా ఇరుకు ఆఫీసుల్లో పనిచేయలేక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వాటి స్థానం లో కార్పొరేట్ కార్యాలయాలను తలదన్నే రీతిలో అధునాతన భవనాలు నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లకు వచ్చే వారు కూర్చోవడానికి కొన్నిచోట్ల కుర్చీలు లేకపోవడం తో చెట్ల కింద బయట వారు సర్దుకుపోతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే వర కు కార్యాలయాల్లో వారు నిలబడాల్సిన ప రిస్థితి నెలకొంది.రానున్న రోజుల్లో అ లాం టి పరిస్థితి రాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ ఆఫీసులను తలదన్నేలా తీర్చిదిద్దాలని సిఎం ఆదేశించారు.రాష్ట్రంలో మొత్తం 141 సబ్ రిజిస్ట్రార్ కా ర్యాలయాలుండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనాల్లో నడుస్తుండగా ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న ఆదిలాబాద్‌లో ని బోథ్,' మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సబ్ రి జిస్ట్రార్ ఆఫీసులను ఎన్నికల కోడ్ తర్వాత ప్రారంభించాలనిప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం 104 ఆఫీసులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 52 చోట్ల కార్యాలయాలకు అవసరమయ్యే భవనాల నిర్మాణానికి ప్రభుత్వ భూమి కూడా కేటాయించారు. భూములు సిద్ధంగా ఉన్న చోట వీలైనంత త్వరగా మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులను నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. మిగతా 52 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సరిపడా స్థలాలను అన్వేషించాలని, పబ్లిక్ యుటిలిటీ కింద సేకరించిన స్థలాలు అందుబాటులో ఉంటే అక్కడే నూతన భవనాలు నిర్మించాలని ముఖ్యమంత్రి సూచించారు. మొదటి దశలో ఆదాయం ఎక్కువగా తెచ్చిపెడుతున్న రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలని ఆయన నిర్ణయించారు. అక్కడికి వచ్చే క్రయ, విక్రయదారులు తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసేంత సేపు మంచి ఆతిథ్యమిచ్చే, ఆహ్లాదంగా ఉండే కార్పొరేట్ లుక్, వెయిటింగ్ హాల్, తాగునీటి సదుపాయం, కేఫ్‌టేరియా లాంటి అన్ని సదుపాయాలుండాలని సిఎం అధికారులకు సూచించారు. అవన్నీ ఉండేలా ఈ నిర్మాణాలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే చోట సిబ్బంది కొరత లేకుండా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఆదాయం తక్కువగా ఉన్న జిల్లాల ఆఫీసుల నుంచి ఎక్కువ పని ఉన్న చోటుకు సిబ్బందిని సర్దుబాటు చేయాలని కూడా ఆయన ఆదేశించారు.

# వేలమంది తెలంగాణ బిడ్డలను చంపిన బలిదేవత ఎవరు..?




హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : కాంగ్రెస్ పార్టీపైన, గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో తెలంగాణ సమాజానికి జరిగిన ద్రోహాలపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎక్స్ వేదికగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన దారుణాలను ప్రశ్నించారు. తెలంగాణలో వేలమంది ఎవరివల్ల అమరులయ్యారు..? అమరువీరుల స్థూపం ఎవరివల్ల నిర్మించాల్సి వచ్చింది..? అంటూ ప్రశ్నల పరంపరను మొదలుపెట్టారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని వేరుగానే ఉంచాలని, ఆంధ్రాతో కలుపవద్దని పోరాడిన విద్యార్థులపై సిటీ కాలేజీ దగ్గర కాల్పులు జరిపింది ఎవరు..? 1969–71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డలను కాల్చి చంపింది ఎవరు..? 1971 పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లలో తెలంగాణ ప్రజాసమితి పార్టీని గెలిపిస్తే.. ఆ పార్టీని మాయం చేసింది ఎవరు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ విధంగా కాంగ్రెస్ ద్రోహాలను ఒక్కొక్కటిగా ప్రశ్నల రూపంలో ప్రస్తావిస్తూ.. ఆ ప్రశ్నలకు 'కాంగ్రెస్ పార్టీ' అనే సమాధానాలను ఇస్తూ పోయారు. చివరగా 'రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా వేలాది మంది తెలంగాణ బిడ్డలను చంపిన బలిదేవత ఎవరు..?' అనే ప్రశ్నను సంధించారు. ఈ ప్రశ్నకు మాత్రం 'కాంగ్రెస్ పార్టీ' అనే సమాధానం ఇవ్వకుండా ఖాళీగా వదిలేశారు. ఎవరు అనేది నెటిజన్‌లే చెప్పాలి అన్నట్టుగా డ్యాష్ పెట్టి వదిలేశారు.

# గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయాలి



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు : జూన్ 9న జరుగబోయే గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అదే రోజున ఇంటెలిజెన్స్ బ్యూరో పరీక్ష కూడా ఉందన్నారు. చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తారని, ఎన్నికల వల్ల ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్–1 సన్నద్ధం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో పరీక్ష వాయిదా వేసి నెల రోజులు సమయం ఇస్తే బాగా ప్రిపేర్ అవుతారని చెప్పారు. కాగా, గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9వ తేదీ నే నిర్వహించడానికి టీజీపీఎస్సీ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నది. జూన్ ఒకటో తేదీ మధ్యాహ్నం నుంచి హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీజీపీఎస్సీ పేర్కొంది. జూన్ 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష జరుగనున్న విషయం తెలిసిందే. పరీక్ష కోసం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. రాష్ట్రంలోని 563 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16 వరకు దరఖాస్తులు స్వీకరించారు. జూన్ 9న ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహిస్తున్నది. జూన్ ఒకటి నుంచి టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR(V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215